క్లుప్తంగా

హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న కనకయ్య

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండలకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగ్యారంటీల పథకాలతో గద్దెనెక్కిన పాలకులు వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు. మాలోతు రావూజా, నిమ్మల మధు, కీసరి వెంకట్రావు, లక్ష్మీనర్సయ్య, అమల తిరుపతమ్మ, వర్సా శ్రీరాములు, గుగులోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పనుల నిమిత్తం ఉదయం 8 నుండి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సన్మానం



రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న చాడ వెంకటరెడ్డి

బూర్గంపాడు: మండలకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన తెలంగాణ ఉద్యమ కళాకారుడు తోకల రవిప్రసాద్‌ను ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ శుక్రవారం సన్మానించి అవార్డును అందించింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఐదు జిల్లాల పరిధిలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలంగాణ ఉద్యమ కళాకారులను సన్మానించి అవార్డులను అందించారు.

డాక్టరేట్ పొందిన వ్యక్తికి..



కిరణ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: పట్టణానికి చెందిన కిరణ్ కుమార్‌కు నోయిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీలో డాక్టరేట్ సాధించినందుకు బండారు చందర్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చందర్‌రావు భవన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కిరణ్ జోత్స్న దంపతులను సన్మానించారు. ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలకు అంతరాయం

దమ్మపేట: ఏపీజీవీబీ సేవలకు, శనివారం నుంచి నాలుగు రోజులపాటు అంతరాయం కలగనుందని దమ్మపేట ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ లింగాల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకును తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేయనున్న సందర్భంగా నిర్వహించనున్న అంతర్గత సాఫ్ట్‌వేర్, సర్వర్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం బ్యాంకు సేవలు, యూపీఐ వంటి ఆన్‌లైన్ కార్యకలాపాలను, నాలుగు రోజులపాటు నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. జనవరి 1 నుంచి యథావిధిగా టీజీబీ పేరుతో పునరుద్ధరించబడతాయని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పాయం పర్యటన

అశ్వాపురం: మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు శుభకార్యాలకు హాజరయ్యారు. వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ముత్తినేని సుజాత, ఊసా అనిల్, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, కొండలరావు, బేతం రామకృష్ణ, తూము వీరరాఘవులు, సామకూరి వెంకన్న, చెంచల రాము, నరసింహారావు, దేపంగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ తెచ్చిన రగడ..!

వ్యాపారుల నడుమ వివాదాలు
- అసంపూర్తి పనులతో తప్పని తిప్పలు
- సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలతో దుర్వాసన
- విద్యుత్–ఆర్అండ్‌బీ శాఖల సమన్వయం లోపం



అసంపూర్తి డ్రైయినేజీతో నిలిచిన మురుగునీరు

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో కోట్లాది రూపాయాల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి, విస్తరణ, మెగా డ్రైయినేజీ పనులు కాస్త కొద్ది నెలలుగా వ్యాపారుల మధ్య వివాదాలకు దారితీస్తోంది. రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం కూడా వ్యాపారులను రెండు వర్గాలుగా మారేలా చేస్తోంది. ఇప్పటికే అనేక సార్లు వ్యాపారులు మధ్య గొడవలు జరగ్గా, తాజాగా గత బుధవారం రాత్రి సైతం వివాదం చోటు చేసుకుంది.

దశాబ్దాల అనంతరం నిధులు

ఎన్నో దశాబ్దాలు పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్, మెగా డ్రైయినేజీ, రహదారి విస్తరణ పనులకు గత ప్రభుత్వ హయంలో అసెంబ్లీ ఎన్నికల ముందు అశ్వారావుపేట–బూర్గంపాడు మార్గంలో 1.50 కిలోమీటర్లు ప్రధాన రహదారి విస్తరణ, అదేవిధంగా అశ్వారావుపేట–సత్తుపల్లి–జంగారెడ్డిగూడెం మార్గాల్లో 2 కి.మీ పొడవున సెంట్రల్ డివైడర్లతోపాటు సెంట్రల్ లైటింగ్, మెగా డ్రైయినేజీ నిర్మాణాలకు మొత్తం కలిపి రూ.18 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమి పూజ చేసినా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయాయి. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవతో ఈ ఏడాది జూలై నుంచి పనులు పునఃప్రారంభించారు.

అసంపూర్తి పనులు, నాణ్యత డొల్ల..

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం, పనుల్లో నాణ్యత లేమికి తోడు వ్యాపారుల వద్ద అనధికారిక వసూళ్లకు పాల్పడటంతో గొడవలు జరుగుతున్నాయి. కొద్ది నెలల క్రితం సత్తుపల్లి మార్గంలో డ్రైయినేజీ వర్షాలకు కూప్ప కూలిపోయింది. దీంతో నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్లు స్పష్టంగా కనిపించినా భారీ వర్షాలే కారణమని అధికారులు, కాంట్రాక్టర్లు చెప్పడం విశేషం. బూర్గంపాడు మార్గంలో ఇరువైపులా డ్రైయినేజీ పనులను స్తంభాలు అడొచ్చిన చోట నిలిపేసి మిగతా చోట్ల చేపడుతున్నారు. వాస్తవంగా ఆయా డ్రైయినేజీల నిర్మాణాలు చేపట్టే ఇరువైపులా స్తంభాలు అడ్డు ఉన్నాయని ముందుగానే గుర్తించారు. వీటిని తొలగించేందుకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి విద్యుత్ శాఖకు రూ.1.20 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఏడు నెలలు కావొస్తుండగా అది జరగలేదు. అయినా స్తంభాలు తొలగించకుండానే పనులు మొదలుపెట్టేశారు. తీరా పనులకు అడ్డువస్తున్న స్తంభాల దగ్గర డ్రైయినేజీ పనులను కొద్ది దూరం నిలిపివేసి ఆ తర్వాత మళ్లీ నిర్మాణాలు చేస్తూ వెళ్తున్నారు. దీంతో ఇళ్లు, దుకాణాలు, హోటళ్లలో వాడే మురుగు నీటితోపాటు కొందరు వ్యాపారుల ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు కూడా నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.

రెండు వర్గాలుగా మారి..



వాగ్వాదానికి దిగిన వ్యాపారులు (ఫైల్)

కొన్ని నెలలుగా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలతోపాటు మురుగు నీరు అసంపూర్తిగా నిర్మించిన డ్రైయినేజీల్లో చేరి తమ దుకాణాలు, ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో ఆ దుర్వాసన భరించలేక నానా అవస్థలు పడుతున్నామని కొందరు వ్యాపారులు వాపోతున్నారు. అభివృద్ధి పేరుతో అసంపూర్తి పనులు చేస్తూ, తమకు నరకం చూపిస్తున్నారని ఇంకొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలుగా సాగుతున్న పనులతో ఓ పక్క తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. ఇటీవల ఓ వ్యాపారి తన దుకాణం ముందు ఆగిన సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాలు, మురుగునీటిని రోడ్డుపైకి వదిలేలా గండి కొట్టేందుకు జేసీబీ తెప్పించాడు. దీంతో మరో దుకాణదారుడు వాగ్వాదానికి దిగగా వ్యాపారులు రెండు వర్గాలు మారి గొడవ పెట్టుకున్నారు. చివరికి మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి సర్దిచెప్పి పంపించారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారి ఒకరు వివరణ ఇస్తూ స్థానిక విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ వివాదాలు నెలకొనగా, డ్రైయినేజీ పనులు ముందుకు సాగడం లేదన్నారు. స్తంభాలు తొలగించేందుకు అంచనాలు పెంచగా చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

మన్మోహన్ సేవలు మరువలేనివి

ప్రధానిగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలం: ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని అవనతం చేస్తున్న మేనేజర్ ఆదినారాయణ



దమ్మపేట: మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే, నాయకులు



మణుగూరు టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నాయకులు



భద్రాచలంటౌన్: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ఆధ్వర్యంలో..



అశ్వాపురంలో..



దుమ్ముగూడెంలో..



బూర్గంపాడులో..



అశ్వారావుపేటరూరల్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అన్నపురెడ్డిపల్లిలో..



చర్లలో..

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మొక్క నాటుతున్న వెంకట పుల్లయ్య తదితరులు

బూర్గంపాడు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య అన్నారు. సారపాకలోని ఐటీసీ రా మెటీరియల్ సీసీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు పెండింగ్ ఉండొద్దని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలన్నారు. సీటు బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలుపోతున్న వారి కుటుంబాల పరిస్థితిని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భారజల కర్మాగారం ఉద్యోగి పాము శ్రీకాంత్ తోటి ఉద్యోగుల వద్ద సేకరించిన విరాళం రూ.13,220 శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ఉండాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ మంగువాయిబాడువ ఆరోగ్య ఉపకేంద్రం గ్రామాల ప్రజలకు బైరాగులపాడు గ్రామంలో డాక్టర్ పుల్లారెడ్డి క్షయవ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనుమానితులకు టీబీ పరీక్షలు నిర్వహించి, నమూనాలు ట్రూనాట్ టెస్ట్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 'నిక్షయ్ షివిర్'లో భాగంగా అనుమానితుల గుర్తింపు, శాంపిల్ సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుని, పూర్తిగా నిర్మూలించడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీపీఎం కో ఆర్డినేటర్ సోమయ్య, ఎస్‌టీఎస్ రాజు, హెల్త్ అసిస్టెంట్ ధర్మయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

శునకాన్ని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

భద్రాచలంఅర్బన్: ప్రమాదవశాత్తు సెప్టిక్‌ట్యాంక్‌లో పడిపోయిన శునకాన్ని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పట్టణంలోని జగదీష్‌కాలనీలో ఓ వ్యక్తి ఇంటి ఆవరణలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు ఓ శునకం పడింది. ఈ విషయాన్ని సదరు ఇంటి యజమాని జంతు ప్రేమికుడు ఉదయ్‌కుమార్ తెలపగా బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో వెంటనే అగ్నిమాపకశాఖ సిబ్బందికి తెలియజేయగా, సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది ఆ శునకాన్ని సురక్షితంగా బయటకు తీశారు.



ట్యాంకులో పడిపోయిన శునకం

మరమ్మతులు చేపట్టినా కంకరతేలి..





కంకరతేలిన గండుగులపల్లి - పట్వారిగూడెం రోడ్డు

దమ్మపేట: రోడ్డు మరమ్మతులు చేపట్టిన కొన్ని రోజుల వ్యవధిలోనే కంకరతేలి గుంతమయంగా మారిపోయింది. మండల పరిధిలోని గండుగులపల్లి–పట్వారిగూడెం రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిపోగా ఎమ్మెల్యే జారే మరమ్మతులు నిర్వహించాలని అధికారులకు సూచించగా స్పందించిన అధికారులు గుంతలను పూడ్చి, మరమ్మతులను నిర్వహించారు. కానీ సరిగా రోలింగ్ చేయించకపోవడంతో గుంతలను పూడ్చిన కొద్దిరోజుల్లోనే కంకరంతా బయటకు వచ్చి తిరిగి గోతులు పడ్డాయి. బయటకొచ్చిన కంకర రోడ్డుపై పలుచోట్ల చిందరవందరగా పడటంతో, వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రాత్రివేళల్లో ఈ గుంతలతో పాటు రోడ్డుపై ఉన్న కంకర వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే సొంత గ్రామం అయిన గండుగులపల్లిలోనే అధికారులు రహదారికి నాసిరకంగా మరమ్మతులు నిర్వహించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

- రాజకీయ పార్టీలు, కార్మిక సంఘ నాయకుల సంఘీభావం
- కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

● బూర్గంపాడు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం సమ్మె బాట పట్టారు. సారపాక, బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీల కార్మికులు సమ్మెను ప్రారంభించారు. ఈ సమ్మెను సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె చేసి, ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

● పినపాక: పంచాయతీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని కార్మిక సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని లేనిఎడల నిరసనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. నాయకులు, కార్మికుల పాల్గొన్నారు.

● ములకలపల్లి : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జీపీ వర్కర్లు ఆరంభించిన సమ్మె శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, యూనియన్ మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు వర్కా రుక్మాంగధరరావు, గద్దల మహేశ్, బైటి అశోక్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● మణుగూరు రూరల్ : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. జీఓ నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలన్నారు.

● అశ్వాపురం: కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయతీ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలిపి ఆయన ప్రారంభించారు. పార్టీ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, మండల కార్యదర్శి ఏడెల్లి శ్రీను, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, తిప్పారెడ్డి శ్రీనివాసరెడ్డి, ధరావత్ రాంబాబు, వెంకటేశ్వర్లు, శివకృష్ణ ఉన్నారు.

● దుమ్ముగూడెం: పంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులు నరేష్, భవాని, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రామకృష్ణ, జానకి, జంపన్న, నరసింహారావు, సునీత, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● కరకగూడెం: పంచాయతీల కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో సమ్మె చేపట్టారు. కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పలి సాంబశివరావు, మొడెం సంజీవకుమార్, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, గాందర్ల ధనుంజయ్, కార్యదర్శి కొమరం ప్రశాంత్, కల్లూరి రమేష్, కార్మికులు సునీత, జమున, మమత, కమల మాధవి, చుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

● అశ్వారావుపేటరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎదుట చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సీపీఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య సందర్శించి మద్దతు పలికారు. సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్, బీ చిరంజీవి, ప్రసాద్, నరసింహారావు, వెంకటప్పయ్య, ముత్తారావు, కన్నారావు, సురేష్, విజయ్, మంగరాజు ఉన్నారు.



పినపాక: సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు



ములకలపల్లిలో..



బూర్గంపాడులో..



అశ్వాపురంలో..



మణుగూరు రూరల్ : సమ్మె శిబిరంలో పంచాయతీ కార్మికులు



దుమ్ముగూడెంలో..



కరకగూడెంలో..



అశ్వారావుపేటరూరల్: సమ్మెకు మద్దతు పలికి మాట్లాడుతున్న నాయకులు